క్లుప్తంగా

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గాన్ని అనుసరిస్తూ ఆయన అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం గాంధీ జయంతి నేపథ్యంలో ఆయన నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సత్యం అహింసా మార్గాలతో ఎంతటి మహాయుద్ధాన్నైనా గెలవచ్చునని మహాత్ముడి నిరూపించాడన్నారు. గ్రామ స్వపరిపాలన కోసం ఆ నాడే నాంది పలికిన గాంధీ అడుగుజాడల్లో మరెక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వపరిపాలన అందిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం మహాత్ముడి అడుగు జాడల్లో నడుస్తూ స్వచ్ఛహీ కార్యక్రమం నిర్వహించడం, స్వచ్ఛభారత్‌ను దిగ్విజయంగా అమలు చేయడం మంచి పరిణామమన్నారు.

76.59 శాతం పింఛన్ల పంపిణీ



అప్పారావుపాళెంలో అనారోగ్యంతో మంచానికి పరిమితమైన రమణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు బ్రహ్మయ్య

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తున్న సామాజిక పింఛన్లు పంపిణీ తొలి రోజు ఆదివారానికి 76.59 శాతం పూర్తయింది. మొత్తం 5,020 మంది లబ్ధిదారులు ఉండగా 3,833 మందికి రూ.1,06,45,250 నగదును వలంటీర్లు పంపిణీ చేశారని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు.

మర్రిపాడులో 62.72 శాతం

మర్రిపాడు మండలంలోని 17 సచివాలయాల పరిధిలో తొలిరోజు ఆదివారం 62.72 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 6394 మందికి 6,014 మందికి రూ.1,11,10,250 నగదును పంపిణీ చేశారు.

సంగంలో 72 శాతం..

సంగం: మండలంలో ఆదివారం తొలి రోజు పింఛన్ల పంపిణీ 72 శాతం జరిగిందని అధికారులు తెలిపారు. మిగిలిన వారికి ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న బార్ కార్యదర్శి ఐ మాల్యాద్రి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.మాల్యాద్రి అన్నారు. మండల న్యాయసేవా అధికార సంఘం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. మాల్యాద్రి మాట్లాడుతూ పలువురు చట్టాలపై అవగాహన లేక వక్రీకరించి మాట్లాడుతుంటారని, దాని వల్ల సమస్యలు కొని తెచ్చుకుంటారన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వొకేట్లు ఎల్‌వీ రమణయ్య, మధు, లయన్స్ క్లబ్ ఆత్మకూరు శాఖ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ డే



సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ

అల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం సీనియర్ సిటిజన్ డే నిర్వహించారు. సీనియర్ సిటిజన్ ఎం.లక్ష్మీనారాయణ, పఠాన్ గౌస్‌ఖాన్‌లను ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ శశిరేఖ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, వీఆర్వోలు రంతుల్లా, సలాం, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

మాంసం విక్రయించొద్దు

అల్లూరు: సోమవారం గాంధీ జయంతి సందర్భంగా నగర పంచాయతీలో ఎక్కడా జంతు వధ, మాంసం విక్రయాలు చేయరాదని నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మాంసం విక్రయాలు చేస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రోడ్డుకెక్కిన తమ్ముళ్ల రచ్చ

- నవాళ్లు.. ప్రతి నవాళ్లు.. శాపనార్థాలు
- ఇరువర్గాల ఫిర్యాదులపై కేసుల నమోదు
- చేతులెత్తేసిన పార్టీ ఇన్‌చార్జి మాలేపాటి
- క్రమశిక్షణ పేరుతో మహిళా నేతలకు మాత్రం వార్నింగ్‌లు, అవమానాలు



కావలి: కావలి టీడీపీలో తమ్ముళ్ల రచ్చ రోడ్డుకెక్కింది. పార్టీలో నేతల మధ్య విద్వేషాలు సైతం నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. పార్టీ ద్వితీయ శ్రేణులు రెండు గ్రూపులుగా విడిపోయి అధిపత్యం కోసం పరస్పరం కొట్లాడుకోవడం రివాజుగా మారింది. తాజాగా ఆ పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా మోహరించి మారణాయుధాలతో దాడులు, ప్రతి దాడులు చేసుకుని, పోలీస్ కేసుల వరకు వెళ్లారు. ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరిస్తున్నా.. సమన్వయం చేయడంలో, విభేదాలను కట్టడి చేయడంలో విఫలం కావడం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మాలేపాటి అసమర్థతకు అద్దం పడుతుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. పార్టీలో విభేదాలకు కారణమైన మాగాళ్లపై చర్యలు తీసుకునేందుకు సహసించలేని మాలేపాటి మహిళా లీడర్లపై క్రమణ శిక్షణ పేరుతో వార్నింగ్‌లు ఇవ్వడం, పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో నుంచి తొలగించడం వంటి చర్యలతో తన ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారనే ప్రచారం జోరందుకుంది.

సమన్వయం చేయడంలో మాలేపాటి విఫలం

చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు భార్య, మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మిని పత్రికల్లో రాయడానికి సాధ్యపడని భాషతో తిట్టాడని పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి, దళిత నాయకుడు జ్యోతి బాబురావుపై మలిశెట్టి దంపతులు, వారి అనుచరులు ఆదివారం మారణాయుధాలతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనపై మలిశెట్టి దంపతులతో పాటు మరో ఆరుగురు పేర్లు కనపరిచిన జ్యోతి బాబురావు ఇంకా 100 మంది ఉన్నారంటూ కావలి వన్ టౌన్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మలిశెట్టి వెంకటేశ్వర్లు దంపతులతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఈ విషయం తెలిసి మలిశెట్టి వెంకటేశ్వర్లు తన అనుచరుడి చేత జ్యోతి బాబురావు, అతని అనుచరులపై పోలీసులకు ఫిర్యాదు చేయించాడు. మలిశెట్టి వెంకటేశ్వర్లు వ్యూహాత్మకంగా పార్టీలో తనకు వ్యక్తిగత ప్రత్యర్థి, పార్టీలో చిచ్చు పెట్టే వ్యక్తిగా చెలామణి అవుతున్న బొట్లగుంట శ్రీహరినాయుడుపై కూడా ఫిర్యాదు చేయడంతో ఈ వర్గంపై ఎస్సీ, ఎస్టీ సెక్షన్ల కింద కేసును నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం జ్యోతి బాబురావు వర్గం కావలి గ్రామ దేవత కలుగోళమ్మ ఆలయానికి చేరుకుని, మలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన భార్య విజయలక్ష్మి అన్నీ అబద్ధాలే చెబుతున్నారని, నాశనం అయిపోతారని జ్యోతి బాబురావు శాపనార్థాలు పెట్టాడు. కావలిలో పార్టీని భ్రష్టుపట్టించే కుట్రలో పావుగా మారిన జ్యోతి బాబురావే అబద్ధాలు చెబుతున్నాడని, నాశనం అయిపోతాడని మలిశెట్టి వెంకటేశ్వర్లు ప్రతి శాపనార్థాలు పెట్టాడు. ఇదిలా ఉండగా తనను చంపడానికి మలిశెట్టి వెంకటేశ్వర్లు ప్రయత్నిస్తున్నాడని, ఆయనతో తనకు ప్రాణహాని ఉందని చెబుతున్నా.. పార్టీ నాయకత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదని దళిత నాయకుడు జ్యోతి బాబురావు ఆరోపిస్తున్నాడు. కావలి పార్టీ ఇన్‌చార్జి అంటూ చెప్పుకునే మాలేపాటి సుబ్బానాయుడు లీడర్లను, క్యాడర్‌ను ఎలా హ్యాండిల్ చేయాలో అర్థం కాక చేతులెత్తేశాడు.

మహిళా నేతలపైనే ప్రతాపం

అయితే మాలేపాటి మహిళా నేతలపై తన ప్రతాపం చూపిస్తున్నాడని పార్టీలో సర్వత్రా చర్చ జరుగుతోంది. పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన మహిళ నేత, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య ఇటీవల జరిగిన నిరసన దీక్షలో పార్టీ టికెట్ ఇచ్చే వారి గెలుపు కోసం పని చేద్దామంటూ చేసిన వ్యాఖ్యలపై సీరియస్ అయిన మాలేపాటి ఆమెకు ఫోన్ చేసి అతిగా ప్రవర్తించవద్దంటూ హెచ్చరికలు చేశాడు. పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు, బీసీ నేత ద్రోణాదుల వాసంతి ఇటీవల చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా మరో నేత చేపట్టిన ర్యాలీలో పాల్గొందని ఆమెను క్రమశిక్షణ తప్పావంటూ పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో నుంచి తొలగించి అవమాన పరిచాడు. ఈ ఇద్దరు మహిళా నేతలు 15 రోజులుగా పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో టీడీపీలో మహిళలకు, దళితులకు అవమానాలేనా అంటూ చర్చ జరుగుతోంది.

తల్లిదండ్రుల బాధ్యతను విస్మరించరాదు

కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్



వృద్ధులను సత్కరిస్తున్న ఆర్డీఓ, ఎల్డర్స్ క్లబ్ నిర్వాహకులు

కావలి: వృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమ బాధ్యతను సంతానం మరచిపోరాదని, లేకుంటే చట్టపరమైన చర్యలుంటాయని కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ స్పష్టం చేశారు. కావలి ఎల్డర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఆర్డీఓ మాట్లాడుతూ ఎల్డర్స్ క్లబ్ తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి తాము ఎప్పుడూ సిద్ధమేనని, ఓల్డేజ్ హోమ్ స్థాపనకు ప్రయత్నిస్తున్న క్లబ్ నిర్వాహకులను అభినందించారు. వృద్ధుల అనుభవాలు సమాజానికి, ప్రస్తుత తరానికి తెరిచిన పుస్తకాలు వంటివన్నారు. ఎల్డర్స్ క్లబ్ అధ్యక్షుడు జేబీఎం నాయుడు మాట్లాడుతూ 2018లో స్థాపించిన ఎల్డర్స్ క్లబ్ ద్వారా వృద్ధులైన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసి వదిలేస్తున్న సంతానానికి క్లబ్ కౌన్సెలింగ్ చేయడం, అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను చక్కదిద్దడం చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు, విశ్రాంత తహసీల్దారు బత్తల కొండయ్య, క్లబ్ గౌరవాధ్యక్షుడు దుగ్గిశెట్టి బాలయ్య, గ్రంధి వెంకయ్యలను క్లబ్ ఉపాధ్యక్షులు, కె.గోపాలకృష్ణ, సి.శారద, ట్రెజరర్ విద్యాసాగరరావు, ఈసీ సభ్యురాలు విద్యావతి ఇతర సభ్యులు రావి కోటిరెడ్డి, లలిత, ఆర్డీఓ శీనానాయక్, కావలి తహసీల్దార్ కె. మాధవరెడ్డి ఘనంగా సత్కరించారు. వృద్ధులకు నిర్వహించిన సాహిత్య పాటల పోటీలకు ఎస్.రామచంద్రయ్య, క్లబ్ కార్యనిర్వాహక సభ్యురాలు టి. విద్యావతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కావలితో పాటు కలిగిరి, జలదంకి, గూడూరు నుంచి వృద్ధులైన గాయకులు పోటీలో పాల్గొని తమ మధుర స్వరాలతో చక్కని పాటలతో అలరించారు. సంయుక్త నృత్య కళాశాల నాట్యగురువు లిఖిత ఆధ్వర్యంలో బృంద నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. నృత్యకారులకు ఆర్డీఓ బహుమతులనిచ్చి అభినందించారు. పాటల పోటీలో మొదటి మూడు స్థానాల్లో గెలుపొందిన 70 ఏళ్ల అన్నపూర్ణమ్మ, విట్స్ కాలేజ్ ఫ్యాకల్టీ అరుణ, గూడూరుకు చెందిన గాయకుడు మాధవరావుకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు.

రెడ్‌క్రాస్‌లో జాతీయ రక్తదాన దినోత్సవాల ప్రారంభం



డాక్టర్ జయగోపాల్ జోలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి: స్వచ్ఛంద రక్తదానం సాటి మనిషిపై ప్రేమకు, దయార్ద్ర హృదయానికి చిహ్నమని రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు అన్నారు. ఆదివారం రెడ్‌క్రాస్ భవనంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. భారతదేశంలో రక్త మార్పిడి చికిత్స పితామహులు డాక్టర్ జయగోపాల్ జోలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ డాక్టర్ జయగోపాల్ జోలీ జన్మదినాన్ని 1975 నుంచి జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినంగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు పాటిస్తున్నట్లు తెలిపారు. కావలి రెడ్‌క్రాస్, ఇతర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు అవగాహనా కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు, రక్తదాతల అభినందన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ, మదీనా మస్జిద్ నిర్వాహకులు డాక్టర్ సయ్యద్ ఖలీల్ అహ్మద్, కావలి రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరి రెడ్డి, రెడ్‌క్రాస్ పోషక సభ్యులు బుర్లా రఘుకుమార్‌రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, కొండాపురం మండల రెడ్‌క్రాస్ కన్వీనర్ తాడికొండ నవీన్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ ఏ వీ హనుమకుమార్, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పీవీ సాయితేజ, టీం సేవియర్స్ అధ్యక్షుడు ప్రణీత్, కీర్తిప్రియ, మనీష్, రమణ్ సుందర్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా బాధితులకు ఎమ్మెల్యే దంపతుల పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దంపతులు





కావలి: మండలంలోని కొత్తపల్లిలో వినాయక చవితి పండగ గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహం నిమజ్జనానికి తీసుకెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బాణసంచా పేలిన ఘటనలో బాధితులను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన వారిని చూసి చలించిపోయారు. వారం క్రితం జరిగిన ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు ప్రమాదం అంచున వరకు వెళ్లి నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అప్పుడే ఎమ్మెల్యే హుటాహుటినా నెల్లూరుకు వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. ముగ్గురు చిన్నారులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి గ్రామానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు ఆదివారం గ్రామానికి వెళ్లి బాణసంచా పేలుడులో గాయపడిన చిన్నారులకు మెరుగైన చికిత్స కోసం వ్యక్తిగతంగా అండగా ఉంటానని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చిన్నారులను ఎమ్మెల్యే దంపతులు పరామర్శించి ఓదార్చారు.

3 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

వరికుంటపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతుల అనుభవం, సాగులో ఉన్న అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు ఈ నెల 3 నుండి 5వ తేదీ వరకు రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దార్ ఎస్.మల్లికార్జున ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న కనియంపాడు, వరికుంటపాడు, రామాపురం, వేంపాడు, విరువూరు, మహమ్మదాపురం, డక్కునూరు, తూర్పురొంపిదొడ్ల, పాములపల్లి, 4న పెద్దిరెడ్డిపల్లి, ఎన్.కొండాయపాళెం, గణేశ్వరపురం, రామదేవులపాడు, గువ్వాడి, కాంచెరువు, జి.కొండారెడ్డిపల్లి, తూర్పుచెన్నంపల్లి, తొడుగుపల్లి, తోటలచెరువుపల్లి, 5న తూర్పుబోయమడుగుల, జడదేవి, తిమ్మారెడ్డిపల్లి, టి.కొండారెడ్డిపల్లి, పాపన్నగారిపల్లి, యర్రంరెడ్డిపల్లి, ఇస్కపల్లి, గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. గ్రామసభల నిర్వహణకు నాలుగు బృందాలను నియమించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న సీఐ జి వేణు, సిబ్బంది

ఆత్మకూరు: పట్టణంలోని పలు కూడళ్లలో సీఐ జి.వేణు, ఎస్సై కె ముత్యాలరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శనివారం రాత్రి, ఆదివారం పలు ద్విచక్ర వాహనాలను, ఆటోలను నిలిపి డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడే వారికి రూ.10 వేల జరిమానా విధిస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్పేస్ క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ

చేజర్ల (సోమశిల): అనంతసాగరం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన స్పేస్ క్విజ్ పోటీల్లో సోమశిల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆదివారం తెలిపారు. ఈ క్విజ్ పోటీల్లో సోమశిల ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ సౌఖ్య, ఎం.మల్లేశ్వరి టాపర్లుగా నిలిచారన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

వరికుంటపాడు: బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఇస్కపల్లి–ఎన్‌బీ కాలనీ మధ్య జరిగింది. ఉదయగిరి మండలం దుర్గంపల్లెకు చెందిన బకీరు కళ్యాణ్ వరికుంటపాడు మండలం విరువూరు వైపు బైక్‌పై వెళుతున్నాడు. ఇస్కపల్లి–ఎన్‌బీకాలనీ సమీపంలో బైక్‌ను వెనుకగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటనలో కళ్యాణ్ కాలికి తీవ్ర గాయమైంది. 108 సిబ్బంది క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరు తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో..

మండలంలోని ధర్మవరం వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఉదయగిరి మండలం కృష్ణంపల్లికి చెందిన జక్కం చెన్నకేశవులు తీవ్రంగా గాయపడ్డాడు. చెన్నకేశవులు బైక్‌పై పామూరు వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ధర్మవరం సమీపంలో మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో చెన్నకేశవులు గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు వరికుంటపాడు పీహెచ్‌సీకి తరలించారు. కాగా రెండు ప్రమాద ఘటనలపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

స్వచ్ఛతహీ సేవాకు సహకరించండి



ఆత్మకూరు కాశీనాయన ఆశ్రమం వద్ద స్వచ్ఛత హీ సేవ ప్రారంభిస్తున్న దృశ్యం



పోలీస్‌స్టేషన్‌లో పరిశుభ్రం చేస్తున్న ఎస్సై, సిబ్బంది



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కృష్ణాపురం బస్టాండ్ సెంటర్‌లో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్, విద్యార్థులు



డీసీపల్లి ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో పరిశుభ్రం చేస్తున్న పొగాకు వేలం కేంద్ర నిర్వహణ అధికారి రాజశేఖర్, సిబ్బంది



పరిసరాలను శుభ్రపరుస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ



పరిసరాలను శుభ్రపరిచి చెత్తను కాల్చేస్తున్న విద్యార్థులు



వీధుల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతతో పాటు గ్రామాలు, పట్టణాలు బాగుపడతాయని ప్రతి ఒక్కరూ రోజుకు గంట సమయం కేటాయించి స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వర రావు అన్నారు. పట్టణంలోని కాశీనాయన ఆశ్రమం వద్ద ఆదివారం ఉదయం 10 గంటల నుంచి గంట పాటు స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మతో పాటు కమిషనర్ మెప్మా, మున్సిపల్ సిబ్బంది స్వచ్ఛ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తయారు చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్లు జే ప్రసాద్, వరలక్ష్మి, మెప్మా సీఓ మాధవి, సుష్మ, వెంకటరమణమ్మ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు సునంద తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల స్వచ్ఛతహీ సేవ

చేజర్ల (సోమశిల): స్వచ్ఛతహీ సేవలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు అనంతసాగరం మండలం సోమశిల ప్రాజెక్ట్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణాన్ని పోలీస్ సిబ్బంది ఆదివారం శుభ్రపరిచారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై భోజ్యానాయక్, కానిస్టేబుళ్లు మోహన్, ఏడుకొండలు, నరసింహ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాడవాడలా స్వచ్ఛతహీ సేవ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయం, డీసీపల్లిలోని భారత పొగాకు బోర్డు కార్యాలయం, మర్రిపాడులోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆదివారం స్వచ్ఛతహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. డీసీపల్లిలో పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ స్థానిక విద్యార్థులు, తమ సిబ్బందితో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. కృష్ణాపురం బస్టాండ్ సెంటర్‌లో జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులు, 30 మంది సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. మర్రిపాడు కస్తూర్బాగాంధీ కళాశాలలో ప్రిన్సిపల్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాల్లో వేలం కేంద్రం ఫీల్డ్ ఆఫీసర్, ఉద్యోగులు సిరాజ్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతహీ సేవ ర్యాలీ

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ నరసింహులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మనం పరిశుభ్రంగా ఉండడంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. పర్యావరణాన్ని కూడా పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతహీ సేవలో భాగస్వాములు కావాలి

చేజర్ల: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతహీ సేవలో భాగస్వాములు కావాలని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి కోరారు. స్వచ్ఛతహీ సేవలో భాగంగా చేజర్ల పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఏక్ తారీఖ్ ఏక్ గంట శ్రమదాన్‌తో పరిసరాలను శుభ్ర పరిచారు. పిచ్చి మొక్కలను పీకి, చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ రామయ్య, సచివాలయ సిబ్బంది, హరిత రాయబారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛతహీ సేవ

అల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏక్ తారీఖ్ ఏక్ గంట కార్యక్రమంలో స్వచ్ఛతహీ సేవ నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణం పరిసరాలను ఎంపీపీ శశిరేఖ, ఎంపీడీఓ శ్రీదేవి, మండల ప్రజా పరిషత్ సిబ్బంది శుభపరిచారు. మండల ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆర్ఎస్ఆర్ విద్యార్థుల స్వచ్ఛతహీ సేవ

కావలి: మండలంలోని గౌరవరంలో ఉన్న ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలలోని విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు బృందాలుగా ఏర్పడి ఆదివారం స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యాటక ప్రాంతం తుమ్మలపెంట బీచ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్లాస్టిక్ వాడకం, నిషేధించాలనే అంశాలపై అవగాహన కలిగించారు. పాఠశాలకు దగ్గరగా ఉన్న టోల్‌ప్లాజా సిబ్బందికి ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ ఆ పరిసరాలను శుభ్రపరిచారు. ఆర్ఎస్ఆర్ పాఠశాలలోని యాజమాన్యం విద్యార్థులకు పరిశుభ్రత మీద అవగాహన కోసం పాఠశాలలో స్వచ్ఛత ఛాయా చిత్రాలను, చిత్రలేఖనం, వివిధ అంశాలపై ఫొటోలు, పోస్టర్లు, పెయింటింగ్‌లు ప్రదర్శించారు. ఆర్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ రామిరెడ్డి ప్రతాపకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ రామిరెడ్డి ఆదిలక్ష్మి స్వచ్ఛతహీ సేవ కార్యక్రమం నిర్వహించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను, ఉపాధ్యాయేతర సిబ్బందిని అభినందించారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

అనుమసముద్రంపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నెలలో ఒక రోజు ఒక గంట పాటు తమ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ చేస్తే ఆ గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం స్వచ్ఛతహీ సేవా భాగంలో మండలంలోని పెద్దబ్బీపురంలో నిర్వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ షేక్ ఖాదర్‌వలి, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ మసూద్, వలంటీర్లు, గ్రామ ప్రజల సహకారంతో పలు వీధుల్లో, ప్రభుత్వ కార్యాలయాలు ప్రార్థనా మందిరాల వద్ద స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

• వడ్డెర సంఘం నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న వడ్డెర సంఘ నాయకులు

కావలి: చిత్తూరు జిల్లా పెనుమూరులో గత నెల 17న కనిపించకుండా పోయిన 16 ఏళ్ల బాలిక భవ్యశ్రీ 4 రోజుల తర్వాత విగతజీవిగా పాడుబడిన బావిలో శవమై తేలిందని, ఈ పాశవిక దుర్ఘటనకు పాల్పడిన కిరాతకులైన దోషులను కఠినంగా శిక్షించాలని వడ్డెర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కావలి పట్టణంలో ఆదివారం భవ్యశ్రీ హంతకులపై చర్యలు తీసుకోవాలని వడ్డెర సంఘం ర్యాలీ నిర్వహించింది. వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనంలో భాగంగా విగ్రహాన్ని బావి వద్దకు తీసుకువెళ్లగా బావిలో భవ్యశ్రీ మృతదేహం లభ్యమైందన్నారు. భవ్యశ్రీ మృతదేహం గమనిస్తే గుండు చేయించి, కళ్లు పీకి, అత్యాచారం చేసి బావిలో పడేసి ఉంటారని జనాలు భావిస్తున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా భవ్యశ్రీ తరఫున మాట్లాడే నాయకులు ఒక్కరూ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన భవ్యశ్రీకి న్యాయం చేయాలని కావలిలో పార్టీలకతీతంగా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు గుంజి గోపి, ప్రధాన కార్యదర్శి గుంజి నరేష్, కావలి నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా లక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు.